కుక్కలకు కు.ని. ఆపరేషన్‌లు

- పరిగిలో తొలి జంతు జనన నియంత్రణ కేంద్రం
- నేటి నుంచి కుక్కలను పట్టేందుకు ప్రత్యేక టీం
- యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ తోనే కుక్కకాటు ప్రమాదానికి రక్షణ

పరిగి, సెప్టెంబర్ 20 : కుక్కల జనాభాతో పాటు పెరిగిన కుక్కకాట్ల నియంత్రణకు సర్కారు సంకల్పించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా వికారాబాద్ జిల్లాను ఎంపిక చేసింది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసి, ముందుగా మున్సిపాలిటీ, ఆ తర్వాత మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉండే కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించడానికి సిద్ధమైంది. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించడం ద్వారా కుక్కల సంఖ్య గణనీయంగా తగ్గించవచ్చని ఆలోచిస్తున్నది. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని వికారాబాద్‌లో అనేక ఏండ్లుగా జీహెచ్ఎంసీ పర్యవేక్షణలో కొనసాగుతున్న జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని తిరిగి వాడుకలోకి తీసుకువచ్చింది. జిల్లాలోని మిగతా మూడు మున్సిపాలిటీలకుగాను పరిగి, కొడంగల్‌లలో జంతు జనన నియంత్రణ కేంద్రాలు ప్రారంభానికి సిద్ధమవగా.. తాండూరులో మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ఏర్పాటు కానున్న తొలి జంతు జనన నియంత్రణ కేంద్రం ప్రారంభానికి పరిగిలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరిగి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన గల రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం పాత భవనాన్ని ఈ కేంద్రం ఏర్పాటుకు సిద్ధం చేశారు.

ప్రతిరోజూ ఇద్దరు డాక్టర్లచే కు.ని.ఆపరేషన్‌లు

పరిగి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న జంతు జనన నియంత్రణ కేంద్రంలో ప్రతిరోజూ ఇద్దరు పశుసంవర్ధక శాఖ డాక్టర్లచే కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించడం జరుగుతుంది. ఇందుకుగాను పరిగి నియోజకవర్గం పరిధిలో గల పశువైద్య కేంద్రాల్లో సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఇద్దరు డాక్టర్‌లు, ఇద్దరు సహాయకులు జంతు జనన నియంత్రణ కేంద్రంలో కుక్కలకు కు.ని.ఆపరేషన్‌లు నిర్వహించేందుకు, చికిత్స కోసం విధులు కేటాయించారు. ప్రతిరోజూ కనీసం పది కుక్కలకు వారు కు.ని.ఆపరేషన్‌లు చేయనున్నారు. పరిగి మున్సిపాలిటీతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో మొత్తం 2944 కుక్కలు ఉండగా.. వాటిలో మగ కుక్కలు 1627, ఆడ కుక్కలు 1317 ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు గుర్తించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం సైతం ఉన్నది. పరిగి మున్సిపాలిటీ పరిధిలోనే సుమారు 600 కుక్కలు ఉన్నట్లు సమాచారం. ఇదిలావుండగా ఆపరేషన్ అనంతరం మూడు రోజులపాటు కుక్కలను ఈ కేంద్రంలోనే ఉంచి వైద్యం అందించడంతోపాటు భోజన సదుపాయం కల్పిస్తారు. మగ కుక్కలను మూడు రోజుల్లోనే తిరిగి ఆయా కాలనీలు, గ్రామాల్లో వదిలిపెట్టే అవకాశం ఉంటుంది. ఆడ కుక్కలకు కు.ని. ఆపరేషన్ మరింత క్లిష్టతరంగా ఉంటుందని, వాటిని ఆపరేషన్ తర్వాత వారం రోజుల వరకు ఈ కేంద్రంలో ఉంచి వైద్యం అందించాల్సి ఉండడంతో ముందుగా మగ కుక్కలకు కు.ని. ఆపరేషన్‌లు చేయించాలని అధికారులు నిర్ణయించారు. ఆ తర్వాత ఆడ కుక్కలకు చేయవచ్చని, తద్వారా కుక్కల జనాభా నియంత్రణ సాధ్యమని పేర్కొంటున్నారు. కు.ని. ఆపరేషన్‌లు చేసిన కుక్కల ఎడమ చెవిని V ఆకారంలో కట్ చేస్తారు.

నేటి నుంచి పరిగిలో కుక్కలు పట్టివేత

కుక్కల జనాభా నియంత్రణ కోసం జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేస్తున్న సర్కారు ప్రత్యేక శిక్షణ పొందిన బృందంచే కుక్కలు పట్టే కార్యక్రమం చేపట్టనున్నది. పరిగిలో శనివారం నుంచి కుక్కలను పట్టేందుకు ప్రత్యేక టీం రానుంది. ఇందులో భాగంగా జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో రెండు టీంలు కుక్కలను పట్టనున్నాయి. ఒక టీం పరిగి, కొడంగల్ ప్రాంతాలు, మరో టీం వికారాబాద్, తాండూరులలో పనిచేస్తాయి. వారు ముందుగా మున్సిపాలిటీల పరిధిలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో కుక్కలను పట్టి బోనులో బంధించి జంతు జనన నియంత్రణ కేంద్రానికి తీసుకువస్తారు. ఆపరేషన్‌ల తర్వాత తిరిగి అదే ప్రాంతానికి కుక్కలను తీసుకువెళ్లి వదిలిపెడతారు. ఈ టీంలకు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు కలిపి రూ.1.50లక్షలు ప్రతి నెలా ఇవ్వాల్సి ఉంటుంది. మరోవైపు జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటు, నిర్వహణ సైతం మున్సిపాలిటీలకే అప్పగించారు. ఆపరేషన్‌ల సమయంలో అవసరమయ్యే మందుల ఖర్చుల్లో సగం మున్సిపాలిటీ భరించనుండగా.. మిగతా సగం ప్రత్యేక నిధుల నుంచి ఖర్చు చేయనున్నట్లు తెలిసింది. జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటు అంశం బాగున్నా నిధులు ప్రభుత్వం ఇవ్వకుండా మున్సిపాలిటీలపై భారం వేయడం తగదని పలువురు పేర్కొంటున్నారు. ఈ భారంతో ఆయా మున్సిపాలిటీల్లో అభివృద్ధి కోసం ఖర్చు చేసే నిధులు ఈ కేంద్రం నిర్వహణకు వెచ్చించాల్సి ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

వ్యాక్సినేషన్ చేయకుండా కుక్కకాటు నియంత్రణ ఎలా?

ఇటీవలి కాలంలో గ్రామాలు మొదలుకొని పట్టణాల్లో కుక్కల జనాభాతోపాటు కుక్కకాట్లు సైతం అదే స్థాయిలో పెరిగాయి. చిన్నారులు మొదలుకొని వృద్ధులు, ఆవులు, గేదెలను సైతం కుక్కలు కాటు వేస్తున్నాయి. పరిగి పట్టణంలో ఒకే కుక్క పది మందిని కాటు వేసింది. కుక్క కాటు నుంచి రక్షించాలంటే చేయాల్సింది వాటి జనాభా నియంత్రణ ఒక్కటే కాదని, కుక్కలకు కు.ని. ఆపరేషన్‌తో పాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయాలని పలువురు సూచిస్తున్నారు. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఒక ఏడాదిపాటు పనిచేయనుండగా.. ప్రతి సంవత్సరం వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయడం ద్వారా కుక్క కాటుకు గురైన వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా మూడాలని పేర్కొంటున్నారు. కేవలం జనాభా నియంత్రణతో కుక్కకాటు ప్రమాదాలు తొలగిపోవని, వ్యాక్సినేషన్ ఒక్కటే ముందు జాగ్రత్తగా పనిచేస్తుందని సూచిస్తున్నారు. ఈ దిశగా ప్రభుత్వం నిర్ణయించి ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న జంతు జనన నియంత్రణ కేంద్రాల్లో శాశ్వత ప్రాతిపదికన వైద్యులు, సిబ్బందిని నియమించి వీధి కుక్కలకు వ్యాక్సినేషన్, కు.ని. ఆపరేషన్‌లు నిరంతరం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇందుకుగాను రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది.

పట్టుకొచ్చిన కుక్కలను ఉంచేందుకు ఏర్పాటు చేసిన బోన్లు

ఆపరేషన్ అనంతరం చికిత్స పొందడానికి కుక్కలను ఉంచే బోన్లు

కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

త్రి సభ్య కమిటీకి మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఎంపిక

వికారాబాద్, సెప్టెంబర్ 20 : హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో మాతా శిశు మరణాలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న దుర్భరమైన వైద్య ఆరోగ్య పరిస్థితుల పతనంపై భారత రాష్ట్ర సమితి ఒక నిజనిర్ధారణ, అధ్యయన కమిటీ వేసిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

త్రి సభ్య కమిటీలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఎంపికయయ్యారు. ఈ కమిటీలో మాజీ ఉప ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ రాజయ్యతో పాటు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఉన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వైద్య ఆరోగ్య పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో పార్టీ తరపున అధ్యయనం చేసి ఒక నివేదిక ఇచ్చే అవకాశం కల్పించిన పార్టీకి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ధన్యవాదాలు తెలిపారు.

రానున్న వారం రోజుల పాటు విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో స్థితిగతులను పూర్తిగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా నివేదికను అంద జేస్తామన్నారు. మేము ఇచ్చే సలహాలు, సూచనలతో రాష్ట్రంలోని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

'మహాలక్ష్మి'తో నిరుపేదలకు మేలు

మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబర్ 20 : మహాలక్ష్మి పథకంతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మోమిన్‌పేట మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ పథకం వచ్చిన ప్పటి నుంచి వికారాబాద్ జిల్లాలో 1.70 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ ఖర్చుల కింద ఆర్టీసీకి రూ.908 కోట్లు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సరిదిద్దడానికి రేవంత్‌రెడ్డి రాత్రింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు నెల మొత్తం జీతాలు ఇచ్చే పరిస్థితి, ఇప్పుడు ఒకటో తేదీన జీతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. చరిత్రలో ఎక్కడా లేనివిధంగా రైతులకు రెండు లక్షల రూపాయల రుణ మాఫీని అందించారని గుర్తు చేశారు. హామీ ఇచ్చినట్లుగా త్వరలోనే మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 20 : రాష్ట్రంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌గా గుర్తింపు పొందిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన చిలుక మధుసూదన్‌రెడ్డిని చైర్మన్‌గా, సీహెచ్ భాస్కరాచారిని వైస్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే మరో 16 మందిని డైరెక్టర్లుగా నియమించారు. డైరెక్టర్లుగా నియమితులైన వారిలో తుర్కయాంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్, అసిస్టెంట్ డైరెక్టర్ రంగారెడ్డి జిల్లా హార్టికల్చర్ డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ అధికారి, హయత్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ తదితరులు ఉన్నారు. ఈ మేరకు చిలుక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విచారణ నిర్వహిస్తున్న డీటీడీవో కమలాకర్‌రెడ్డి

రచ్చకెక్కిన పంతుళ్ల పంచాయితీ

- ఉపాధ్యాయుడిపై కొత్తపల్లి గ్రామస్తుల ఆగ్రహం
- విచారణ నిర్వహించిన డీటీడీవో కమలాకర్‌రెడ్డి

కులకచర్ల, సెప్టెంబర్ 20 : విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాల్సిన ఉపాధ్యాయులు ఒకరిపై ఒకరు దూషించుకుంటూ విద్యార్థుల ఎదుటే దూషణలు చేసుకున్నారు. నీవెంత అని మహిళా ఉపాధ్యాయురాలిని మందలించడంతో పాటు తోటి ఉపాధ్యాయుడు తిట్టాడని భావించిన కొత్తపల్లి ఆశ్రమ పాఠశాల గ్రామస్తులు కోపంతో ఆశ్రమ పాఠశాలకు వెళ్లి రాజు అనే ఉపాధ్యాయుడిని నిలదీశారు. పదజాలాన్ని మార్చుకోవాలని సూచించారు. వెంటనే నవాబుపేట ఎస్ఐ కల్పించుకొని గ్రామస్తులను సముదాయించి పంపించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డీటీడీవో కమలాకర్‌రెడ్డి అక్కడికి చేరుకొని కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంఘటనను అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులను విడివిడిగా అడిగి తెలుసుకున్నారు. మహిళా ఉపాధ్యాయురాలిని కూడా ప్రత్యేకించి విచారణ నిర్వహించినట్లు.. తనను ఎవ్వరూ దూషించలేదని, ఫ్రెండ్లీగానే ఉన్నామని మహిళా ఉపాధ్యాయురాలు తెలిపారని డీటీడీవో తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో ఇలాంటి న్యూసెన్సులు ఎందుకు చేస్తున్నారని ఉపాధ్యాయులను మందలించినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరుగకుండా చూసుకోవాలన్నారు. వార్డెన్ లేని సమయంలో ఇలాంటి దూషణలు చేసుకోవడం పట్ల ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది క్రమశిక్షణారాహిత్యమన్నారు. ఉపాధ్యాయుల దూషణలకు సంబంధించిన విషయాలను పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించడం జరిగిందని తెలిపారు. నివేదికను పై స్థాయి అధికారులకు అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

సమీక్షా సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్

దోమ, సెప్టెంబర్ 20 : ఆదర్శ పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల కలరింగ్ పనుల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. దోమ మండలం ఊటుపల్లి, తిమ్మాయిపల్లి, దోమ, బాసుపల్లి గ్రామ పంచాయితీల పరిధిలోని ఆదర్శ పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల కలరింగ్ పనులను వారాంతపు సమీక్షా సమావేశంలో భాగంగా శుక్రవారం సుధీర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో చేపట్టి వేగంగా పూర్తి చేసే దిశగా ప్రత్యేక కృషి చేయాలని పనుల నిర్వాహకులు, అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి పనులపై పలు సూచనలు చేయడంతోపాటుగా విధి నిర్వహణలో ఉద్యోగులు అలసత్వం వహించేవారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, ఎంపీవో సోమలింగం, ఏపీవో దస్తయ్య, ఏపీఎం సురేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జగనమ్మ, ఎంఎన్‌వో వెంకటేశ్, హెచ్ఎంలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దాడుల్లో పట్టుబడ్డ రేషన్ బియ్యం వాహనం

రేషన్ బియ్యం పట్టివేత

పెద్దేముల్, సెప్టెంబర్ 20 : గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ ట్రాలీ ఆటోను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పెద్దేముల్ ఎస్ఐ గిరి అన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండల పరిధిలోని గాజీపూర్ గ్రామ సమీపంలో నేడు(శుక్రవారం) ఉదయం 9 గంటల సమయంలో అక్రమ రేషన్ బియ్యం రవాణా జరుగుతుందని వచ్చిన నమ్మదగిన సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బంది, జిల్లా పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ఆశీష్‌తో సంయుక్తంగా తనిఖీ చేశారు. ఆ రోడ్డు మార్గంలో వస్తున్న ట్రాలీ ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో సుమారు 14 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. దీంతో ట్రాలీ ఆటోను, నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా ట్రాలీ ఆటోలో జహీరాబాద్‌కు చెందిన కళ్శెం వెంకట్ అనే డ్రైవర్ అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తూ జహీరాబాద్‌కు చెందిన బోయిని సుభాష్‌కు అమ్మడానికి తీసుకెళుతున్నాడని పోలీసుల విచారణలో తేలిందన్నారు. దీంతో వెంకట్, సుభాష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

- యువత కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి
- కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక శాఖల మంత్రి మన్సూఖ్ మాండవియా
- కన్హా శాంతి వనంలో ప్రారంభమైన అంతర్జాతీయ యూత్ సెమినార్



అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి మన్సూఖ్ మాండవియా, ఇతర ప్రముఖులు

నందిగామ, సెప్టెంబర్ 20 : ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ధ్యానాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో భాగంగా చేసుకోవాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక శాఖల మంత్రి మన్సూఖ్ మాండవియా అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యూత్ సెమినార్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ధ్యాన కేంద్రంలో కొద్దిసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మనిషి ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను, తాను స్వయంగా పొందిన అనుభూతిని వివరించి ప్రతి రోజూ తప్పకుండా ధ్యానం చేయాలని కోరారు. భారత ప్రభుత్వం వికసిత్ భారత్ పేరుతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు. ప్రజల అంతర్గత ఆరోగ్యం, మానసిక, భౌతిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక అంశాలను ప్రజలకు బోధించడంలో శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. యువతకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని, యువత కొత్త అలోచనలతో ముందుకెళ్లాలని సూచించారు.

ఈ సందర్భంగా జూమ్ యాప్ ద్వారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మాట్లాడుతూ.. ధ్యానం ఏకాగ్రతను పెంచుతుందని, క్రీడలపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మనం ప్రభుత్వంతో కలిసి ముందుకెళ్లాలని తన సందేశాన్ని ఇచ్చారు.

అనంతరం కమలేశ్ పటేల్‌తో కలిసి మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అభ్యాసినులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు సెమినార్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు కన్హా శాంతివనానికి సీఎం రేవంత్‌రెడ్డి

కన్హా శాంతి వనంలో జరుగుతున్న అంతర్జాతీయ యూత్ సెమినార్‌కు శనివారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు సెమినార్ నిర్వాహకులు తెలిపారు. తొలిసారిగా సీఎం కన్హా శాంతివనానికి వస్తుండటంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రేణుకాదేవి

విద్యార్థుల్లో విశ్వాసాన్ని పెంపొందించాలి

పరిగి, సెప్టెంబర్ 20 : మాతృభాషతోపాటు ఆంగ్లంలో మాట్లాడతామనే విశ్వాసాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. పరిగిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో యంగ్ ఓరేటర్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలాంటి భయం లేకుండా ఇంగ్లిష్‌లో మాట్లాడేలా శిక్షణ ఇవ్వాలన్నారు. వారంలో రెండు రోజులు ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యంపై ప్రత్యేక తరగతులు తీసుకోవాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. ఓరేటర్స్ క్లబ్ నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ఉపాధ్యాయులకు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంవో రామస్తాన్, మండల విద్యాధికారి హరిశ్చంద్ర, మండల నోడల్ అధికారి గోపాల్, మండల ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

అందుబాటులో పుస్తకాలు

గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రియాజ్

పోటీ పరీక్షలపై అభ్యర్థులకు సలహాలు, సూచనలు చేస్తున్న డాక్టర్ రియాజ్

వికారాబాద్, సెప్టెంబర్ 20 : పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తామని, రాబోయే ఉద్యోగాల్లో ఉత్తీర్ణులు కావాలని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రియాజ్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని డాక్టర్ రియాజ్ సందర్శించారు. గ్రంథాలయంలో నెల కొన్న సమస్యలను అభ్యర్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న గ్రంథాలయాల మాదిరిగా తీర్చిదిద్దేందుకు పాటుపడతామని తెలిపారు. గ్రంథాలయంలో ఉద్యోగుల కొరత ఉందని, గ్రంథాలయానికి సరైన నిధులు రావడం లేదన్నారు. గ్రంథాలయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే ఏర్పాటు చేసిన పుస్తకంలో నోట్ చేయాలని సూచించారు. నిధులు వచ్చిన వెంటనే గ్రంథాలయాలకు పుస్తకాలు అందజేయడం జరుగుతుందని వివరించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సలహాలు, సూచనలు చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వస్తాయని, చక్కని ప్రణాళికతో స్కూలు, ఇంటర్, జనరల్ పుస్తకాలు చదవడం ద్వారా లబ్ధి పొందుతారని సూచించారు. గ్రంథాలయంలో ఏ సమస్యలున్నా హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి రావాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి సురేశ్‌బాబు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, ఉద్యోగార్థులున్నారు.

సీజీఆర్ కార్యక్రమాలు ప్రశంసనీయం

- విశ్రాంత స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ
- అన్మాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్‌లో ముగిసిన స్కూల్ ఎర్త్‌క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం

స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు

కడ్తాల్, సెప్టెంబర్ 20 : పర్యావరణ పరిరక్షణతోపాటు జీవ వైవిధ్యాన్ని కాపాడటానికి సీజీఆర్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని విశ్రాంత స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గల ఎర్త్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ-కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్' మూడవ బ్యాచ్ వారికి నిర్వహించిన అవగాహన కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ముగిసింది. రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో కరీంనగర్, నల్గొండ, కామారెడ్డి జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులున్నారు.

ఈ కార్యక్రమానికి రాజేశ్వర్ తివారీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవ వైవిధ్యాన్ని కాపాడటానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే బాధ్యత మనందరిపైన ఉన్నదని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ తరపున చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు.

ప్రముఖ విద్యావేత్త, ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, వ్యా